ప్రజాశక్తి
గురువారం 26 జనవరి 2023
5
విజయనగరం

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం ఉదయం గణతంత్ర వేడుకల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ సూర్యకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పలు ప్రభుత్వ శాఖలు ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలను ప్రదర్శించనున్నాయి. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించనున్నారు. ఏర్పాట్లను ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, తహశీల్దార్ బంగార్రాజు పర్యవేక్షించారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధమైన వేదిక

రన్నర్‌గా నిలిచిన విజయనగరం బాలుర జట్టు

కర్నూలు బాలికల జట్టుకు రన్నర్ ట్రోఫీ అందిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఆద్యంతం.. ఉత్కంఠభరితం

- హోరాహోరీగా సాగిన కబడ్డీ పోటీలు
- బాలబాలికల విభాగాల్లో విజేతగా శ్రీకాకుళం
- బాలురు విభాగంలో రన్నర్‌గా నిలిచిన విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, నెల్లిమర్ల

నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మూడు రోజులపాటు నిర్వహించిన అండర్-17 కబడ్డీ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బుధవారం జరిగిన ఫైనల్లో బాలబాలికల విభాగాల్లో శ్రీకాకుళం జట్లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో కర్నూలు, బాలుర విభాగంలో విజయనగరం జట్లు రన్నర్‌గా నిలిచాయి. మూడు రోజుల పాటు జరిగిన కబడ్డీ టోర్నమెంట్ మ్యాచ్‌లు ఉత్సాహ భరితంగా సాగాయి. 400 మంది క్రీడాకారులు, 80 మంది కోచ్‌లు, మేనేజర్లు, అఫీషియల్స్ పాల్గొని పోటీలను విజయవంతంగా నిర్వహించారు. పోటీలకు అలుగోలు జెడ్‌పి హైస్కూల్ సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలు అందించారు. విజేతలకు జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, జెడ్‌పిటిసి జి.సన్యాసినాయుడు, ఎంపిపి అంబళ్ల సుధారాణి, మండల ఉపాధ్యక్షులు సారిక వైకుంఠరావు, పతివాడ సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గిరిబాల, ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు, ఆర్‌ఐ పి.మనోహర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వి రమణ, ఆలుగోలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జగదీష్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటనాయుడు, సన్యాసినాయుడు, పాఠశాల పిఇటి ఎస్.సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.


గుంకలాం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు ఇలా..

ఉగాదికి పూర్తయ్యేనా?

సంక్రాంతికి ముందే సామూహిక గృహ ప్రవేశాలు చేడతామన్న ప్రభుత్వం విఫలమైంది. ఈసారి ఉగాది రోజున (మార్చి 22)న గృహ నిర్మాణాలు చేపడతామని చెబుతోంది. అందుకనుగుణంగా నిర్మాణాలను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులపైనా, అధికారులు.. సిబ్బందిపైనా, సిబ్బంది.. లబ్ధిదారులపైనా ఒత్తిడి చేస్తున్నారు. ఆర్థికంగా అవకాశం ఉండి, ఇళ్లు నిర్మించుకుంటే మంచిదే. కానీ, అదే ఆర్థిక సమస్యల కారణంగా నిర్మాణాలు చేపట్టలేకపోతే అధికారులు ఎంత ఒత్తిడి చేసినా, స్థలాలు లాగేసుకుంటామంటూ బెదిరించినా లక్ష్యం నెరవేరే పరిస్థితి లేదు. అంతమందీ కాకపోయినా సగానికి సగం మంది ఆర్థిక సమస్యలతో ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారు. కొంతమంది అప్పోసప్పో చేసి నిర్మాణాలు చేపట్టినా, వాటిని పూర్తిచేయడానికి పడరాని పాట్లు పడుతున్నారనడంలో సందేహం లేదు. దీంతో, ఉగాది నాటికైనా లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతాయా? అన్న సందేహం కలుగుతోంది.

- నత్తనడకన గృహ నిర్మాణాలు
- మార్చి 22న ముహూర్తాలు పెట్టిన ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం జిల్లాలో మొత్తం 77,205 ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో 651 లేఅవుట్లలో 36,631 ఇళ్లు, 40,574 వ్యక్తిగత ఇళ్లు ఉన్నాయి. మార్చి 22న జిల్లాలో 34,505 ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. వీటిలో ఇప్పటి వరకు కేవలం 18,320 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలోనూ ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ప్లాస్టింగ్ వంటివి పెండింగ్‌లో ఉన్న ఇళ్లే ఎక్కువ. ఇక పూర్తికావాల్సినవి సుమారు 16,185 ఇళ్లు ఉన్నాయి. మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉంది. పట్టణాలకు చాలా దూరంలో ఉండడం, నివాసయోగానికి అనుకూలంగా లేకపోవడం వంటి కారణాల వల్ల కొన్ని లేఅవుట్లలో ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఆర్థిక ఇబ్బందులూ వెంటాడుతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏమూలాకూ సరిపోని పరిస్థితి ఉంది. ఇసుక, ఇనుము, సిమ్మెంటు, 13 రకాల సామగ్రి ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో ఇసుక ధర ఆకాశాన్ని అంటుతోంది. ద్వారబందాలు, తలుపులు, కిటికీలు, ఎలక్ట్రికల్ సామగ్రి, పైకప్పు రేకులు, టాయిలెట్ తలుపులు, వాటర్ స్టోరేజ్ ట్యాంకు, శానిటరీ ఐటమ్స్, సున్నం.. వంటి ధరలు పేదలు అందుకోలేని పరిస్థితి. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తున్నట్టు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ గుంకలాం వంటి పెద్ద లేఅవుట్లలో శివారు ప్రాంతాలకు విద్యుత్తు, నీటి, అప్రోచ్‌రోడ్డు సదుపాయాలు కల్పించలేదు. ఈ కారణంతో కూడా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు సాహసించడం లేదు.

హైవే పనులను అడ్డుకున్న రైతులు, పోరాట కమిటీ నాయకులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని వసంత గ్రామ ముతంగ్రాంగి సరిహద్దులో గ్రీన్‌ఫీల్డ్ రహదారి పోరాట కమిటీ కో కన్వీనర్ గులిపల్లి గంగు నాయుడు అద్వర్యన రైతులు రెండో రోజు పనులను అడ్డుకున్నారు. పంట పొలాల్లోకి నీరు పోయే కల్వర్టులను ఏర్పాటు చేయాలని రైతులు కోరినా గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్వాహుకుల పట్టించుకోకపోవడంతో బుధవారం రహదారి పనులను మరోసారి రైతులు అడ్డుకున్నారు. ఇరిగేషన్ అధికారులు కల్వర్టు 428, 980నెంబరు గల రాయవద్ద కట్టాలని రికమెండ్ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని బైఠాయించారు. రోడ్డువద్దంటూ మహిళలు, రైతులు వంటా వార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్ రహదారి పోరాట కమిటీ, సర్పంచ్ సిరికి సత్యనారాయణ, ఎంపిటిసి చొక్కాకు సత్యారావు, మాజీ సర్పంచ్ పోలినాయుడు, మాజీ సర్పంచ్ జగరపు దేవుడమ్మ, చోక్కాకు పెద సింహాద్రి, మాజీ సర్పంచ్ కొల్లి వెంకటరావు, నరిసింనాయుడు, కసిరెడ్డి రామారావు తదతరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

జాతీయ ఓటర్ల దినోత్సవంలో సెంచూరియన్ యూనివర్సిటీ విసి

మాట్లాడుతున్న సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు

ప్రజాశక్తి-విజయనగరం

యువత భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్య వ్యవస్థలో విలువలను కాపాడగలమని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.ఎస్.ఎన్. రాజు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఓటు ఒక వజ్రాయుధం లాంటిదని దానిని సక్రమమైన మార్గంలో వినియోగించి ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ నమోదు సరళి చాలా తక్కువగా ఉంటుందన్నారు. దీనిలో మెరుగుదల కనిపించాలంటే ఓటు విలువలను తెలుసుకొని అందరూ ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. సింగపూర్, ఆస్ట్రేలియా, అర్జెంటీనా మాదిరిగా మన దేశంలో కూడా తప్పనిసరి ఓటింగ్ విధానం అనుసరిస్తే ఓటింగ్ నమోదు శాతం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

వ్యక్తిత్వాన్ని చూసి ఓటెయ్యాలి : కలెక్టర్

రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును నిజాయితీగా, నిర్భయంగా వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. కులాలను, మతాలను చూసి కాకుండా వ్యక్తిత్వాన్ని చూసి ఓటు వేయాలని మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని చెప్పారు. ఖమ్మం జిల్లా పాల్వంచలో ఎన్నికల సమయంలో ఎదురైన సంఘటన.. ఎదుర్కొన్న తీరును కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. అర్హత కలిగి ఓటు హక్కును పొందకపోతే.. రేపన్న రోజున ప్రశ్నించే హక్కును కోల్పోతారని ఎస్‌పి దీపిక తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు పోలీస్ వ్యవస్థ పటిష్ట చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం జెసి మయూర్ అశోక్ మాట్లాడారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లకు గుర్తింపు కార్డులను కలెక్టర్, జెసి, ఇతర అతిథుల చేతుల మీదుగా అందజేశారు. వృద్ధ ఓటర్లను సత్కరించారు. ఓటు నమోదు, జాబితాల సవరణ ప్రక్రియలో బాగా పనిచేసిన బిఎల్‌ఒలు, అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. ఆన్‌లైన్ క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ వర్చ్యువల్ విధానంలో సందేశాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని స్థానిక రెవెన్యూ, ఎన్నికల విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. దిశ పోలీస్ స్టేషన్ నుంచి కలెక్టరేట్ వరకు చైతన్య ర్యాలీ సాగింది. డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, స్థానిక తహశీల్దార్ బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐదో సెమిస్టర్ వాయిదా వేయాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రా యూనివర్సిటీ ఐదో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు డిఆర్‌ఒ గణపతి రావుకు బుధవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని 2023 అకాడమిక్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఐదో సెమిస్టర్ రాత పరీక్ష తేదీలను కొద్దిరోజుల క్రితమే ఖరారు చేశారని తెలిపారు. నాలుగో సెమిస్టర్ పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా, ఇంటెన్షిప్ పేరుతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు పెట్టి రెండు నెలలపాటు తరగతులకు దూరం చేశారని చెప్పారు. నెల రోజుల వ్యవధిలో పాఠాలు విని రాత పరీక్షలకు సిద్ధం కావాలని యూనివర్సిటీ పేర్కొనడం అన్యాయమన్నారు. ఫిబ్రవరి పదో తేదీ నుంచి జరగనున్న ఐదో సెమిస్టర్ పరీక్షలను మార్చి రెండో వారానికి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి.రమేష్, సహాయ కారదర్శి రెడ్డి కిరణ్ పాల్గొన్నారు.

ప్రయాణాల్లో భద్రతకు ప్రాధాన్యత

ఎస్‌పి ఎం.దీపిక

సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-డెంకాడ

ప్రయాణాల్లో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌పి దీపిక విద్యార్థులకు సూచించారు. రహదారి భద్రత పట్ల యువతకు అవగాహన కల్పించేందుకు గాను లెండి ఇంజనీరింగు కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యాన బుధవారం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్‌పికి కళాశాల ప్రిన్సిపల్ వి.వి.రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ హరిబాబు, కళాశాల ఫెమీనా సభ్యులు జానకి, పీడీ శైలజ, విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ వాహనాలను అతి వేగంగా నడపడం వల్ల మనం గమ్యాన్ని చేరుకునేలోగా 10 నిమిషాల సమయాన్ని మాత్రమే మిగుల్చుకోగలమని చెప్పారు. అతి వేగంతో ప్రమాదానికి గురైతే ప్రాణాలు కోల్పోవడం లేదా తీవ్ర గాయాలపాలై, అంగవైకల్యం ఏర్పడి జీవితాలనే కోల్పోయి భారీ మూల్యం చెల్లించే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. యువత వాహనాలను సురక్షితంగా నడిపేందుకే మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. లైసెన్సు కలిగి ఉండడంతోపాటు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, భద్రత నియమాలు పాటించాలన్నారు. చాలా వరకు రోడ్డు ప్రమాదాలు అతి వేగం, త్రిబుల్ రైడింగు, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్లే జరుగుతున్నాయన్నారు. వాహనాల నడపడంలో నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువకులే ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జాతీయ రహదారులను అనుమతి ఉన్న చోటే క్రాస్ చేయాలన్నారు. ప్రయాణాల్లో మన భద్రతతోపాటు ఇతరుల భద్రతకు కూడా ప్రాధాన్యతనివ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువమంది ప్రయాణికులను అనుమతించే ఆటోల్లో ఎక్కవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భోగాపురం సిఐ విజయనాథ్, డెంకాడ ఎస్ఐ యు.మహేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం : సిఐటియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహనరావు కోరారు. 73వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగంపై పెద్ద ఎత్తున దాడి చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలు ఏ భాష మాట్లాడాలి, ఏం మాట్లాడాలి, ఏ బట్ట కట్టుకోవాలి, ఏ తిండి తినాలి? అనేది బిజెపి నిర్ణయిస్తోందని చెప్పారు. అలా కాదని ఎవరైనా ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులు పెట్టి నిర్బంధిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రచయితలు, కవులు, కళాకారులు, మేధావులపై దాడులకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి సామాన్యుల పార్టీ కాదని, కార్పొరేట్ల పార్టీ అని ఇటీవల ఆక్స్‌ఫామ్ నివేదిక తేటతెల్లం చేసిందన్నారు. బిజెపి పాలనలో కార్మికులకు పని భద్రత, కనీస వేతనాలు అమలు కావడం లేదని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌టిసి కాంట్రాక్టు కార్మికులు శంకర్రావు, రంగమ్మ జగదీష్, రాజు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

నాడు - నేడు నిధులను

సంపూర్ణంగా వినియోగించండి

అధికారుల సమీక్షలో కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

నాడు - నేడు కార్యక్రమంలో పాఠశాలలు, జూనియర్ కళాశాలను అభివృద్ధికి మంజూరైన నిధులను సంపూర్ణంగా వినియోగించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. పాఠశాల నిర్వాహకులు, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లి ఉత్తమ ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. నాడు - నేడు పనుల పురోగతిపై, లక్ష్యాల సాధనపై బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. నాడు - నేడు ఫేజ్-2లో భాగంగా జిల్లాకు మంజూరైన రూ.210 కోట్ల నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. పనులు జరిగిన మేరకు బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నివేదించాలని పేర్కొన్నారు. పనులతోపాటు పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు, ఎంఇఒలు కృషి చేయాలని సూచించారు.

ఇటీవల పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటనలో ఎదురైన పరిస్థితులను అర్థం చేసుకొని భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ప్రతి సోమవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఆయా పాఠశాలలను సందర్శించి పనుల తాలూక నివేదికలను పంపించాలని ఆదేశించారు. జగనన్న విద్యాకానుకలో కొత్తబ్యాగులను, బూట్లను విద్యార్థులకు అందజేయాలని చెప్పారు. సమీక్షలో భాగంగా పొంతన లేని సమాధానాలు చెప్పిన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మనసు పెట్టి వినాలని, పని చేయాలని హితవు పలికారు. సమావేశంలో డిఇఒ లింగేశ్వరరెడ్డి, సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడు, డివైఇఒ సురేశ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, ఎంఇఒలు, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రెసిడెంట్ అవార్డుకు ఎఎస్ఐ రాజు ఎంపిక

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం పోలీసు స్టేషన్ ఎఎస్ఐ తిరుమల రాజు సూర్య నారాయణ రాజుకు కేంద్ర ప్రభుత్వం ప్రెసిడెంట్స్ పోలీసు మెడల్ ప్రకటించింది. రాష్ట్రం నుంచి 15 మందికి ఈ మెడల్ ప్రకటించగా వారిలో జిల్లాకు చెందిన ఎఎస్ఐ రాజు ఒకరు. 1989లో పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా చేరిన సూర్యనారాయణరాజు 2010లో హెచ్‌సి గాను, 2018లో ఎఎస్ఐ గాను ఉద్యోగోన్నతి పొందారు. సీతానగరం, పాచిపెంట, కొత్తవలస, చీపురుపల్లి, భోగాపురం, విజయనగరం, సిసిఎస్, జిఆర్‌పిలో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు.

మాదక ద్రవ్యాల విక్రయంపై నిఘా

ప్రజాశక్తి-విజయనగరం

యువత మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. సిగరెట్లు, పొగాకు సంబంధిత వస్తువులను అమ్మే వారిపై, మందులు అమ్మే దుకాణాలు, ఇతర బడ్డీలపై గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. జాతీయ బాలల హక్కుల కమిషన్, మాదక ద్రవ్యాల నిరోధక శాఖలు సంయుక్తంగా రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్‌పై బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల దగ్గరలో బడ్డీలు ఉండకుండా చూడాలన్నారు. 18 ఏళ్లలోపు వారికి సిగరెట్లు, మందు వంటివి విక్రయించకుండా చూడాలని, చట్టంలోని అంశాలను దుకాణాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. పాఠశాలలు, కాలేజీలు, మందులషాపుల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శరీర అవయవాలపై పడే చెడు ప్రభావంపై విద్యాసంస్థల్లో అవగాహనా తరగతులను నిర్వహించాలని సూచించారు. మత్తును కలిగించే మందులు వైద్యుల చీటీ లేకుండా విక్రయించ రాదనే నిబంధన పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుదీర్, దిశా డిఎస్‌పి వెంకటేశ్వర్లు, సిడబ్ల్యుసి ఛైర్‌పర్సన్ హిమబిందు, డ్రగ్స్ కంట్రోల్ ఎడి కె.రజిత, డిఇఒ లింగేశ్వర రెడ్డి, సమగ్రశిక్ష ఎపిసి స్వామినాయుడు, జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్, డిఎంహెచ్ఒ రమణ కుమారి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణలో అందరి భాగస్వామ్యం

కమిషనర్ శ్రీరాములు నాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర సుందరీకరణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు కోరారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నగర సుందరీకరణలో భాగంగా గతంలో ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేశామని చెప్పారు. ఆయా ప్రాంతాలలో ప్రధాన రహదారులకు డివైడర్లు అమర్చామన్నారు. చెట్లను నాటి వాటి సంరక్షణ బాధ్యత వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార ప్రతినిధులకు అప్పగించామన్నారు. వాటి నిర్వహణలో మరింత చురుకైన పాత్రను పోషించి అందమైన ఆకృతులతో నిరంతరం చూపరులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. మొక్కలకు అవసరమైన నీటిని తాము అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఎపిసి అమ్మాజీరావు, ఎఇలు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

లక్కవరపుకోట : మండలంలోని రేగ గ్రామ పంచాయతీలోని నీలకంఠాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హర్ష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వి నాయుడుతో పాఠశాలను బుధవారం సందర్శించిన అనంతరం హర్ష మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగంలో ప్రవేశపెట్టిన నాడు - నేడు పథకం హడావుడిగా ఆర్భాటాలతో చేశారే తప్ప కిందిస్థాయి పాఠశాలలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ పాఠశాలలో వర్షం కురిస్తే విద్యార్థులు పడిన బాధలు వర్ణనాతీతమని చెప్పారు. వర్షపు నీరు తరగతి గదిలోకి చేరుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరమని ఆవేదన వ్యక్తం చేశారు. మానసిక ఉల్లాసం కోసం క్రీడా మైదానం కూడా లేదన్నారు. విద్యార్థులకు వండి పెట్టేందుకు మధ్యాహ్న భోజన వసతికి సరైన వంటగది లేని పరిస్థితి దాపురించిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులు చదివి ఎలా ప్రయోజకులవుతారని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చిన్నారికి ఉద్యోగుల ఆర్థిక సాయం

బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఉద్యోగులు

రేగిడి : మండలంలోని చిన్న శిర్లాం గ్రామానికి చెందిన వింత తల వ్యాధి (గ్రస్తురాలు?) మీసాల ఇంద్రజకు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు రూ. 50వేలు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని 25 సచివాలయాలు, వార్డు వాలంటీర్లు ఆర్థిక సహకారంతో ఈ చిన్నారిని ఆదుకున్నారు. ఈ సాయాన్ని బుధవారం చిన్న శిర్లాం గ్రామంలో స్థానిక వైస్ ఎంపిపి టంకాల అచ్చెంనాయుడు, స్థానిక సర్పంచ్ ఉమా పావని, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావులు ఇంద్రజ తల్లిదండ్రులు మీసాల అప్పలనాయుడు, కృష్ణవేణిలకు అందజేశారు. ఇటీవల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటికి వెళ్లి ఇంద్రజను చూసి ఎంపిడిఒ చలించిపోయారు. ఇంద్రజ కుటుంబానికి తనవంతుగా సాయం చేస్తామని హామీ ఇచ్చి 25 సచివాలయాలు, గ్రామస్థాయి వాలంటీర్లతో చర్చించారు. ఇందులో భాగంగా వారంతా ఆర్థిక సాయానికి ముందుకొచ్చారు. వీరుతోపాటు సోషల్ మీడియా మండల కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు కేశవరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు రక్తహీనతను అధిగమించాలి

డెంకాడ : బాలికలు రక్తహీనతను అధిగమించాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మోపాడ కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనతకు కారణాలు, పౌష్టికాహారం, బాల్య వివాహాల నిర్మూలన, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, చేతుల పరిశుభ్రత, ఉన్నత లక్ష్యాలు తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలంటే బాల్య వివాహాలు జీరోకు చేరుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల రాష్ట్రంలో 59 శాతం మంది గర్భిణులు ప్రసవ సమయంలో రక్తహీనతతో మరణిస్తున్నారన్నారు. అలాంటి మరణాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలంటే బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112, 1098 నంబరునకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ భవానీ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎడ్ల పరుగు పోటీలు

ఎడ్ల పరుగు పందెంలో పాల్గొన్న ఎడ్ల బండి

వేపాడ : మండలంలోని వల్లంపూడిలో సాంబమూర్తి తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు బుధవారం రసవత్తరంగా జరిగాయి. పోటీలలో మొదటి బహుమతిగా రూ.15వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.8వేలు నగదును గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు చేతులు మీదుగా అందించారు.

బ్రిటిష్ పాలనను తలపిస్తున్న వైసిపి పాలన

వేపాడ : వైసిపి పాలన రాష్ట్రంలో బ్రిటీష్ పాలనను తలపిస్తుందని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిడిపి జాతీయ నాయకుడు నారా లోకేష్ పాదయాత్రకు కావాలనే బ్రిటిష్ పరిపాలనలో అమలు చేసిన జిఒ ఒకటిని ఇప్పుడు ప్రవేశపెట్టారన్నారు. పాదయాత్ర సజావుగా సాగకుండా కుయుక్తులతో, షరతులతో కూడిన అనుమతి ఇచ్చారన్నారు. ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు.

సిగ్నల్ లేక ఫేషియల్ యాప్ ఇబ్బందులు

వేపాడ : మండలంలో పలు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఫోన్లకు సిగ్నెల్స్ లేక ఫేషియల్ యాప్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు ఉదయం విధులకు హాజరయ్యే ముందు, విధులు ముగించుకున్న తరువాత ఫేషియల్ యాప్‌లో హాజరు వేసుకోవాల్సి ఉంది. అయితే దీనికి పూర్తిగా సిగ్నెల్‌తో పని ఉంటుంది. కానీ కొన్ని ప్రాంతాల్లో ఫోన్లకు సిగ్నెల్ లేక ఇబ్బందులు పడుతున్నారు. సిగ్నెల్స్‌కు కోసం ఊరు బయటకు రావడం, మేడలపైకి ఎక్కడం వంటి ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

వేపాడ : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం నేషనల్ గర్ల్ చైల్డ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణి, చైల్డ్ లైన్ జిల్లా కౌన్సిలర్ దుర్గ, ఎంపిటిసి గంగతల్లి, ఐసిడిఎస్ సిబ్బంది కామేశ్వరి, భాగ్య, మహిళా పోలీస్ శ్రీదేవి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి, తదితరులు

లక్కవరపుకోట : మండలంలోని గేదలవానిపాలెం గ్రామం పంచాయతీ పరిధి లోని గేదెలవానిపాలెం, గనివాడ, వేచలవానిపాలెం గ్రామాలకు చెందిన పేదలకు స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ (సింగపూర్) బుధవారం దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాజస్థాన్ ప్రాంతానికి చెందిన పావురాల స్వామి ఆశ్రమంలో ప్రతి ఏడాది ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఆనవాతిగా వస్తుందన్నారు. అందులో భాగంగానే చలికాలం నేపథ్యంలో అనేకమంది పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ, ఎస్ఐ ఎం. ముకుందరావు, ఆర్ఐ రాజేష్, విఆర్ఒ సన్యాసయ్య, ఠాగూర్ సింగ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోండి

వంగర : శివ్వాం కో-ఆపరేటివ్ సొసైటీలో తీసుకున్న పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలని చైర్మన్ యలకల అన్నం నాయుడు, సిఇఒ రాంబాబులు తెలిపారు. మండల కేంద్రంలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలకారులోగా 4శాతం వడ్డీతో చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు. సకాలంలో రెన్యువల్ చేయకపోతే 13 శాతం వడ్డీతో పాటు అసలు కూడా కట్టవలసి ఉంటుందని స్పష్టం చేశారు. రెన్యువల్‌కు సంబంధించి ఆధార్, వన్ బితో పాటు మొబైల్ నెంబర్‌తో సొసైటీని సంప్రదించాలన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి- తెర్లాం

18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓట్లు చేర్పించుకోవాలని ఎంపిపి ఎన్. ఉమాలక్ష్మి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జడ్‌పిహెచ్ స్కూల్ ఆవరణలో విద్యార్థులతో బుధవారం మానవహారం చేశారు. తహశీల్దార్ కార్యాలయం నుండి హై స్కూల్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.రాజేశ్వరరావు, వైస్ ఎంపిపి సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, ఎంఇఒ జె. త్రినాథరావు పాల్గొన్నారు.

రేగిడి : ఓటును మించిన ఆయుధం లేదని రిటర్నింగ్ అధికారి పద్మలత అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద 13వ జాతీయ ఓటర్స్ దినోత్సవం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, డిటి గోవిందరావు, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఉమా పట్నాయక్, సిబ్బంది ఉన్నారు.

వంగర: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి నినాదాలు చేసి ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బుధవారం తహశీల్దార్ డి. ఐజాక్ మండల పరిషత్ సూపరింటెండెంట్ లోపింటి త్రినాధులు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనగల పారినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేగిడి : ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

బొబ్బిలి: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్‌డిఒ శేషశైలజ

వేపాడ : వల్లంపూడి గ్రామ సచివాలయంలో జాతీయ ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో శతాధి వృద్ధునికి సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రుద్ర వెంకట్రావు, ఉప తహశీల్దార్ సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, గ్రామ రెవెన్యూ అధికారి బాల భాస్కరు, యువకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: విద్యార్థి దశ నుంచి ఓటు విలువ తెలుసుకోవాలని ఎస్ఐ పి. నారాయణ రావు అన్నారు. బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో జెడ్‌పి బాలికొన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో: ఓటుహక్కు వినియోగంలో యువత కీలక పాత్ర పోషించాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ఎస్ వర్మ, పారా మెడికల్ డీన్ డాక్టర్ లక్ష్మీనరసింహాచార్యులు, డాక్టర్ సన్నీడియోల్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం అని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరిక పాలన నుండి ప్రజాస్వామ్య పాలనకు వచ్చిన తర్వాత అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో భారత పౌరులందరికీ ఓటు అనే వజ్రాయుధాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఓటర్ల దినోత్సవంలో ఆర్డిఒ పి.శేషశైలజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, ఎన్నికల ఉప తహశీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

భోగాపురం : మిరాకిల్ ఇంజనీరింగు కళాశాలలో బుధవారం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం లోకం నాగ మాధవి, ప్రిన్సిపాల్ ఎ. అర్జున రావు, డిన్ శ్రీనివాస రావు, త్రినాథ రావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్హతలు అవసరం లేదా..?: న్యాయవాది తుమరాడ గంగాధర్

బొబ్బిలి : చట్టసభల్లో పోటీ చేసే అభ్యర్థులకు విద్యార్హతలు అవసరం లేదా అని ఆంధ్రా లాయర్స్ అసోసియేషన్ విజయనగరం జిల్లా కమిటీ అధ్యక్షులు, సామాజిక కార్యకర్త తుమరాడ గంగాధర్ అన్నారు. ఓటర్ల దినోత్సవ సందర్భంగా బుధవారం తన కార్యాలయం ద్వారా 'ఓటర్ బి అవేర్ – సేవ్ డెమోక్రసీ' అంటూ ప్లేకార్డ్‌ను ప్రదర్శిస్తూ చట్టసభల్లో పోటీ చేసే రాజకీయ నాయకులకు కనీస విద్యార్హత అవసరం లేదా అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు కార్యాలయాల నుంచి కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల కార్యాలయాల వరకూ పనిచేస్తున్న అధికారులకు కనీసం విద్యార్హత, వయస్సుని నిర్ణయించి పరీక్షలు నిర్వహించి వారిని విధినిర్వహణ కొరకు పంపించే రాజ్యాంగ నిబంధనలు వున్నాయి కానీ మొత్తంగా కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో శాసనాలు చేసి ప్రభుత్వాన్ని నడిపించే ప్రజా ప్రతినిధులకు ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా కూడా ఏ రకమైన కనీస విద్యార్హతలు లేకపోవడం శోచనీయం అన్నారు. భారత రాజ్యాంగం- ప్రజాసౌమ్య వ్యవస్థ పట్ల కనీస అవగాహన లేక ప్రజాసౌమ్య దేవాలయలైన చట్ట సభల గౌరవాన్ని బూతు పదజాలంతో భ్రష్టు పట్టిస్తున్నారని గంగాధర్ అన్నారు.

వంగర: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న తహశీల్దార్ ఐజాక్, తదితరులు

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. బుధవారం మండలంలోని కోనాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రంతో పాటు వెల్నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను తెలుసుకొని, పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని ఆయనతో పాటు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి సురేష్‌బాబు అన్నారు. గ్రామంలో ఉన్న పరిస్థితితులపై ఆరా తీసారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి జగనన్న ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు కందుల రఘుబాబు, మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఎంపిపి మహంతి కళ్యాణి, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణ రాజు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, రామతీర్థ ఆలయ బోర్డు సంభ్యులు దాడిశెట్టి త్రినాదరావు, సర్పంచ్ బొడ్డు ఉదయబారతి, పాల్గొన్నారు.

బొబ్బిలి : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పల నాయుడు అన్నారు. బుధవారం పురపాలక సంఘం 8వ సచివాలయ పరిధిలో గల 18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు అమలు తీరును అరా తీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, వైస్ ఛైర్మన్ చెలికాని మురళీకృష్ణ, గొలగాన రమాదేవి, బుడా ప్రతినిది ఇంటి గోపాలరావు, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, వార్డు ఇంచార్జ్ కొసిరెడ్డి దేవి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, పట్టణ వైసిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని పెదచామాలపల్లి గ్రామంలో తాజా, మాజీ సర్పంచులు బాయి తౌవుడమ్మ, బాయి అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నూతనగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గిరిజన శాఖ మంత్రి పీడికి రాజన్న దొర ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు.



పూసపాటిరేగ: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ స్వామి, ఎంపి

ఉపాధి కూలీల గైర్హాజరు

తెర్లాం : క్షేత్ర స్థాయి పరిశీలనలో చాలా మంది ఉపాధిహామీ కూలీలు గైర్హాజరవుతున్నారని ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చాలా మంది పనులకు రాకపోవడానికి గల కారణాలేంటని ఎపిఒ జగదీశ్వరరావును అడిగారు. వేరే ఏమైనా పనులుంటే వారితో రాతపూర్వకంగా పని పుస్తకం నుండి తొలిగించడానికి ఆమోదం తీసుకోవాలన్నారు. పని దినాలని దుర్వినియోగం చేసుకుంటే తిరిగి పని కల్పించడం జరగదన్నారు. వేతనదారుడుకి రూ.257 పొందేలా కొలతలు మార్కింగ్ చేసి ఇవ్వాలని క్షేత్ర సహాయకులని ఆదేశించారు. ఎంఎంఎస్ యాప్, డి.మస్తర్లులో హాజరు సరిపోకపోతే సంబంధిత అధికారులు మీద చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. హౌసింగ్ బిల్లులు చెల్లింపులు, ఉపాధిలో గుర్తించిన పని వివరాలు, సంబంధిత రికార్డులు పూర్తి వివరాలతో కార్యాలయంలో అందజేయాలన్నారు.

అధికారులతో సమావేశం

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ పట్నాయక్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సిబ్బంది చేపట్టవలసిన విధులు వివరాలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, పిఆర్ జెఇ ఆలీ, హౌసింగ్ ఎఇ, ఎపిఒ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధనతోనే బహుజనులకు విముక్తి

భోగాపురం : రాజ్యాధికార సాధనతోనే విముక్తి అని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి తలపెట్టిన బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర సభను ఈనెల 28న విజయనగరం పట్టణంలో ఏర్పాటు చేస్తున్నామని దీనికి అందరూ తరలి రావాలంటూ బిఎస్‌పి నెల్లిమర్ల నియోజకవర్గ అధ్యక్షులు ఎరుకొండ వెంకటరావు బుధవారం కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్‌సి, బిసి కాలనీ, గూడెపువలస గ్రామాలను సందర్శించి బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అంగన్‌వాడీలకు ఫేసియల్ యాప్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. పర్యవేక్షణ పేరుతో వేధింపులు అరికట్టాలన్నారు. సుప్రీమ్ కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని కోరారు.

నెల్లిమర్ల: వినతి పత్రాన్ని అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అనంతరం ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం: అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలను రూ.26వేలకు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన ధర్నాలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైఎస్ఆర్ సంపూర్ణమపోషన మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్‌లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని కోరారు. అనంతరం ఐడిఎస్‌పిఒ నాగమణికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి: అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. ఎన్నికలు, పాదయాత్రలో అంగన్వాడీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం అర్బన్ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే అంగన్వాడీలను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు జె. కామేశ్వరి ఏ. రోజా, కె. ఉమాగౌరీ, బి. శ్రీదేవి, ఎన్. కామేశ్వరి, కె. అనురాధ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బొబ్బిలి: ధర్నా చేస్తున్నఅ ంగన్‌వాడీ కార్యకర్తలు

చెరువు ఆక్రమణ పట్టించుకోరా..?

ప్రజాశక్తి - వేపాడ

మండలం లోని వావిలిపాడు రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబరు164-3లోని 91 ఎకరాల్లో ఉన్న కృష్ణమరాజు చెరువు ఆక్రమణకు గురవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ చెరువు గర్భంలోని సుమారు 20 ఎకరాలకు పైగా స్థలాన్ని ఆక్రమిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అక్రమాలు వల్ల చెరువు బక్కచిక్కిపోయి పంట పొలాలకు సకాలంలో నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. పలుమార్లు జిల్లా అధికారులకు దిగువ స్థాయి అధికారులకు తెలిపినప్పటికీ ఆక్రమణలను తొలగించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమావేశం ఏర్పాటు చేసి ఆక్రమణలను తొలగిస్తే తప్ప ఆయ కట్టు రైతులకు న్యాయం జరగదని ఆ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు గండి శ్రీరామ్మూర్తి, రిటైర్డ్ టీచర్, పాతల సీతమ్మ తదితరులు కోరుతున్నారు.

కబ్జాకు గురవుతున్న చెరువు

నైపుణ్య విద్యకు సెంచూరియన్ అనుకూలం

విశ్వవిద్యాలయ సందర్శనలో కెనడా బృందం

కుట్టుమిషన్‌ను పరిశీలిస్తున్న కెనడా బృంద సభ్యులు

నెల్లిమర్ల : నైపుణ్య విద్యకు సెంచూరియన్ విశ్వ విద్యాలయం అనుకూలంగా ఉందని కెనడా బృందం కొనియాడింది. కెనడాలోని సిసిఐ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అలోయ్, ఎమిలి బుధవారం విశ్వ విద్యాలయం సందర్శించి ఇక్కడ బోధన పద్ధతులు, ప్రయోగశాలలు, విద్యా విధానాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, పారా మెడికల్ డీన్ డాక్టర్ లక్ష్మీ నరసింహాచార్యులు, డాక్టర్ సన్నీడియోల్, విశ్వ హూషణ్, చెరుకూరి రవీంద్ర, శ్రీవంశీ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రావువారివీధి, పల్లావీధి, జంగాల వీధిలో బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుం టామని హెచ్చరిం చారు. ఆయనతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పె క్టర్ అనుంమ, తదితరులు పాల్గొన్నారు.

'సీతం'ను సందర్శించిన ఆర్ఎం

విజయనగరం : స్థానిక సీతం కళాశాలను నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రీజినల్ మేనేజర్ బికె సాహు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో పరిశ్రమ- అకడమిక్ కనెక్ట్ పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య ద్వైపాక్షిక జ్ఞాన బదిలీ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్ఆర్‌డిసితో సాంకేతిక వినిమయానికి అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు. పరిశోధన నిధులకు సంభావ్యత ఉందని, సీతం నుండి ఏదైనా ప్రతిపాదన కోసం ఎన్ఆర్‌డిసి తలుపులు తెరిచి ఉంచు తుందని వివరించారు. సాంకేతికత మార్పిడి ప్రయత్నం పట్ల సీతం కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపల్ డి.వి.రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

తైక్వాండో పోటీలకు అమృత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 27 నుంచి బరేలిలో జరిగే 39వ జాతీయస్థాయి జూనియర్స్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు విజయనగరానికి చెందిన క్రీడాకారిణి జి.అమృత వర్షిణి ఎంపికైంది. ఈ సందర్భంగా అమృతను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ రావు అభినందించారు. అక్కడ కూడా పతకాలు సాధించాలన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ ఎస్.కోట జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో

O.S.130/2010

Between:
లింగాల ఉగ్ర నరశింహం వగైరా ....వాదులు
And:
కోదేటి నరసరత్నం వగైరా ...ప్రతివాదులు
To.
D3) కొదేటి సుబ్బారావు S/o లేటు సన్యాసిరావు, బ్రాహ్మణవీధి, Old SBI Road, S.Kota (V), S.Kota మండలం, విజయనగరం జిల్లా.

యీ దావాలో పరిహారం రాబట్టు నిమిత్తం నీపైన పై నెంబరు దావా యుండుటవలన సదరు విషయమై నీకెట్టు ఆక్షేపణలున్నచో యీ కోర్టువారి ఎదుటను **తే 31-01-2023 దీని ఉదయం 10-30 గంటలకు** మీరు స్వయంగా లేదా ప్లీడరుగారి ద్వారా హాజరుకావలెను. లేని ఎడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించడమగునని తెలియపర్చడమయినది.

శ్రీ కోర్టువారి అనుమతితో

పెదగాడ నాగేశ్వరరావు
అడ్వకేటు, ఎస్.కోట,
సెల్ : 9347544360